అభావాలు

పుట్టిన ఆడపిల్ల చచ్చిపోయిందని నర్సు వచ్చి చెప్పేటప్పటికి మూర్తికి గుండె ఆగినంత పనయింది. చప్పున జయ ఆవేదనంతా, తనను ఆవహించినట్లయింది. గాభరాగా డాక్టరు దగ్గరకు పరుగెత్తుకు వెళ్లాడు.

ఆమెగారు ఒక్కసారిగా చూసి 'ఎందుకట్లా వణికిపోతున్నారు, జయకొచ్చిన ప్రమాదం యేంలేదు, ఆడవాళ్ళకు యిది మామూలే....' అన్నది అతి సామాన్యంగా తన పనేమిటో చూసుకుంటూనే.

'అదిగాదండీ' అనబోయి, ఆమెగారి ముఖం చూసేటప్పటికి వెనక్కు తగ్గాడు మూర్తి.

'ఇంకా అదృష్టవంతురాలు. తల్లికి గండంతప్పింది. ఇంకే భయం లేదు. అమ్మాయిని సుఖంగా యింటికి తీసుకెళ్లచ్చు. పాపం పుట్టిన పిల్లను బ్రతికించలేక పోయాము,' అన్నది ముక్తసరిగా.

ఈ మాత్రం, మాట్లాడితే చొరవతీసుకుందామనుకున్న మూర్తికి మంచి సమయం దొరికింది.

'పాపం మీరుమాత్రం యేం చేస్తారు! చెయ్యకలిగిందేమిటో చేశారు. ఇక మా అదృష్టం.... మీతో ఒక్కమాట....' నీళ్లు నమిలాడు.

ఆమె యే కళనుందో చప్పున కుర్చీలోంచి లేచివచ్చింది. ఇద్దరూ ప్రక్క గదిలోకి వెళ్లారు.

'జయను బ్రతికించండి .... ఎట్లాగైనా బ్రతికించండి ....' తడబడుతూ అన్నాడు.

'మీ మగవాళ్లు వట్టి పిరికివాళ్లు. ఈ మాత్రానికే యింత యిదవాలటండీ. నేను చెప్పానుగదా: మీ కింకా భయం యెందుకంట!' డాక్టరు ఎంతో తేలికగా అన్నది.

'జయ పిల్లలకోసం కలవరించిపోతూ వుంటుంది. తెల్లారి లేచినప్పటినుంచి ప్రక్క పిల్లల్ని పెట్టుకుని ఆడుకుంటూ వుంటుంది. పిల్లలంటే అంత మోజు. ఆమె గర్భవతి అయినప్పటినుంచి ఆమె సంతోషానికి అంతేలేదు. తాను కూడా తల్లిని అవబోతున్నానని ఉప్పొంగిపోయింది. ఆడది, సంతానం లేకపోయిన తర్వాత జీవించటం యెందుకంటుంది! ఏమో ఆమె మనస్సు నాకు అర్థం కావటంలేదు. పిల్లలంటే అంత ప్రాణం.... అలాంటిది స్పృహ తెలియంగానే యీ విషయం తెలిస్తే, యెక్కడ ఆవురు మంటుందో అని నాకు చెడ్డ భయంగా వుందండి. నాకేమీ తోచటంలేదు....' ఆయాస పడుతూ ఆమెగారి వంక చూశాడు మూర్తి.

'అవుతే నన్నేం చెయ్యమంటారు....పిల్లవుతే చచ్చిపోయింది...' కటువుగా అన్నది.

'ఈ మాట విని మూర్తి యింకా ఆవేదన పడుతున్నాడు.

'ఎట్లాగైనా ఓదార్చి చెప్పాలి మీరు. మీరేయింత యిదయిపోతూ వుంటే ఆడది, ఆ అమ్మాయియెట్లా నిభాయించుకొంటుంది! ఏదో ఆలోచించండి ఉపాయం....' ఆమె వెళ్లబోతూ అన్నది.

'మీరంత తేలికగా అంటేకాదు. జయ సంగతి మీకు తెలీదు.... వట్టి భయస్థురాలు. ఆమెకు గుండె నిబ్బరం తక్కువ. నా కేమీ పాలుపోవటంలేదు. ఎట్లాగైనా జయను కాపాడండి....' మూర్తి ప్రాధేయపడ్డాడు.

ఆమెగారు ఆలోచిస్తూ మూర్తి వంక చూస్తూ నిలబడిపోయింది. మూర్తి వూపిరి పీల్చుకున్నాడు. ఆమె తల వూపుతూ తన గదిలోకి వెళ్లిపోయింది. మూర్తి వరండాలో పచార్లు చేస్తున్నాడు. తన బుర్రలో యెన్నెన్నో ఆలోచనలు గిర్రున తిరిగి పోతున్నాయి. జయకు సంతానం మీద యింతమోజని తెలుస్తే మాత్రం ఆమెను ఒక్కనాటికి పెళ్లిచేసుకునేవాడు కాదు. కాలేజీలో చదువుకుంటూ, షోకుగా తిరుగుతూ, నలుగురితో పరిచయం చేసుకుంటూ, నలుగురి నోళ్లల్లో పడ్డ మూర్తికి, పెళ్లితొందర యే విధంగానూ లేదు. అయితే తల్లిదండ్రులు గట్టిపట్టుపట్టి, 'మళ్లా కట్నాలబిల్లు వస్తోంది, యింతకాలం ఆగి, యింత చదువు చెప్పించటం వృథా అవుతుందనే' ఆవేదనలో, మూర్తిని బిగించేశారు. తల్లిదండ్రుల మనస్తత్వంతో యేకీభవించక పోయినా, తప్పని సరిగా పెళ్లకొడుకయి కూర్చున్నాడు. అసలు ఆ పెళ్లి జరగటమే చాలా విచిత్రంగా జరిగింది. మూడుముళ్లు పడేదాక నమ్మకంలేక పోయింది. ఏక్షణాన ఎవరొచ్చి, మూర్తిని రచ్చకీడుస్తారో అని అందరూ భయపడుతూనే వున్నారు. పుకార్లకేం, యిష్టంవచ్చినట్లు చెలరేగిపోయినాయి; ఎక్కువ మందికి తెలీకండా యీ పెళ్లి జరిగి పోవటంవలన, అభాసుకాలేదని కొంతమంది అనుకున్నా, అవతల పార్టీవాళ్లు సంఘంలోవున్న ఆంక్షలను పట్టి మెదలకుండా వూరుకుండి వుంటారు అనుకున్నారు కొందరు. ఏమైతేనేం, పెళ్లవుతే సలక్షణంగానే జరిగిపోయింది. అందులో పెళ్లవంగానే ఆవూరు మకామెత్తి వెళ్లి

పోయారు. దాంతో వేడంతా చల్లారిపోయింది. అయితే, వృద్ధులిద్దరు కోడలు యింట్లోకి రావాలని మళ్లీ ఒక పట్టుపట్టారు. మూర్తి తన మొండితనాన్ని బలాన్ని, ధైర్యాన్ని ప్రదర్శించుకున్నాడు. కాని ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించేటప్పటికి, తల్లిదండ్రుల మాట వినక తప్పింది కాదు; జయ కాపరానికి వచ్చినప్పటి నుంచి, మూర్తి అదోవిధంగా వుండటం మొదలు పెట్టాడు. కొత్తగా భార్య కాపరానికి వచ్చినప్పుడు, భర్తకు వుండాలసిన లక్షణాలేవీ, మూర్తిలో కనిపించలా. ఉన్న వూరవుతే ఆ స్నేహితుడని యీ స్నేహితుడని అటూ ఇటూ అల్లరి చిల్లరిగా తిరుగుతూ వుంటే, వూరుమార్చారు. ఊరు మార్చారు గాని, మూర్తి బుద్ధేమి మార్చగలిగారు! దీపం ముందర కునుకుపడుతూ జయమ్మ కూర్చుంటే, ఏ పన్నెండింటికో, ఏ ఒంటిగంటకో తలుపు తట్టుకుని చక్కావస్తాడు లోపలికి. 'ఏమండీ యింత ఆలస్యమయింది' అని కొత్తలో అడిగింది కాని, రోజూ వున్న అలవాటుకు యేమని అడుగుతుంది. ఎంతో విసుగ్గా వస్తాడు. అన్నం తిన్ననాడు తింటాడు. లేనినాడు లేదు. 'అబ్బ! నా ప్రాణం విసిగించక కాసేపు పడుకోనీ' అంటూ జయను విదిలించి కొడుతూవుంటాడు. చప్పున జడలో పూల దండ లాగి విసిరికొట్టి, తన దిండు తాను తీసుకుని దూరంగా వెళ్ళి పడుకుంటుంది బాగా కోపం వచ్చినప్పుడు. ఒక్కొక్కప్పుడు యెంత సేపో బ్రతిమాలుతుంది. 'ఈ వయస్సులో మనకు పిల్లలేమిటి! ఓ పదేళ్లదాకా మనకు పిల్లలు కలగకూడదు' అని ఒకసారి ఎగతాళి క్రింద అనేటప్పటికే జయ ఆనాడు అన్నం ముట్టలేదు. నిద్రపోలేదు. మూతి ముడుచుకుని కూర్చుంది. దగ్గరకు వెళ్లి బ్రతిమాలుదామనుకుంటే, నెత్తికెక్కుతుందేమోనని భయం. అసలు మాట్లాడకపోతే, మనస్సొప్పటం లేదు. చాలాసేపు తికమకపడి యేదో విధంగా నచ్చచెప్పటానికి ప్రయత్నం చేశాడు. జయ, ఎంత సేపటికి, ఏ పిల్ల కనిపించినా

చప్పున చంకలోకి తీసుకొని ముద్దు పెట్టుకొని తన మురిపాన్ని చెల్లించుకుంటుంది. మూర్తి చూస్తే మాత్రం చిటచిటలాడి పోతాడు. తన మొహాన్ని ఎక్కడ చూస్తుందో అని తప్పించుకు వెడతాడు. రోజు రోజుకు యింట్లో పోరు యెక్కువయి పోతోంది. చిట్టచివరకు మూర్తి మానసికంగానూ, శారీరకంగానూ జయకు లొంగిపోవలసివచ్చింది.

జయ గర్భవతి అయినప్పటినుంచి, క్రింద నిలవటంలేదు. అప్పటికప్పుడే బొమ్మలని, చిన్నచిన్న చొక్కాలని, యేమేమిటో తెమ్మంటూనే వుంది. చిన్నచిన్న వస్తువులు యేవి చూసినా, ఆమె సంతోషానికి అంతులేదు. ఎప్పుడు తన పాపను చేతుల్లోకి యెత్తుకుంటానా అంటూ యెదురుచూస్తున్నట్లు ఆ ముహూర్తం కోసం నిరీక్షిస్తోంది. ఆమె చేష్టలు రోజు రోజూ మూర్తికి ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. లోకంలో తన భార్యే బిడ్డను కనబోతోందా, లేక బిడ్డను కనబోయేవాళ్ళందరు మొదట యిట్లాగే వుంటారా అని అనుకుంటూ వుంటాడు. ఏమయితేనేం ఆ ఘడియ రానే వచ్చింది. పిల్ల పుట్టటం అయింది, చావటమూ అయింది. ఈ విషయం జయకు తెలుస్తే, ఆమెను పట్టగలమా! దుఃఖాన్ని ఆపుకోగలదా? ఆ ఆవేశంలో యేమి చేస్తుందో ఎవరూ వూహించలేరు. అయితే డాక్టరు ఆలోచనగా తల వూపింది. కారణం యేమయి వుంటుంది? ఎంత డాక్టరయితే మాత్రం, పోయిన ప్రాణాన్ని తీసుకు రాగలదా? ఇంకా జయకు కొన్నాళ్లపాటు స్పృహ రాకుండా వుంటే బాగుండును. ఇదే మాలోచన! జయ త్వరగా కోలుకోవాలి. ముందర యీ గండం గడిచేదెట్లా? ఈ కబురు యే విధంగా చెప్పటం! ఎవరిపిల్లనైనా తీసుకువస్తే! ఏ తల్లి వూరుకుంటుంది. తన పిల్లను ఇచ్చెయ్యటానికి! బుర్ర వేడెక్కి పోతోంది. మూర్తికి ఎటూ ఆలోచన పోవటంలేదు.

ఒకటి రెండుసార్లు తొంగిచూశాడు గదిలోకి. ఆమెగారు యింకా యేమిటో చూస్తూనే వుంది. వెళ్ళి పిలుద్దామనుకున్నాడు. లోపల ఐదారుగురున్నారు. వాళ్ళెవరికీ తన అదుర్దా తెలియటం యిష్టంలేదు. టైము చూసుకొంటున్నాడు. ఈ లోపల జయకు స్పృహవచ్చి, నా బిడ్డ యెక్కడంటే యేమని చెప్పటం! తెగించి లోపలకు వెళ్ళాడు. డాక్టరు కుర్చీలోలేదు. 'లోపలకు వెళ్లారు, ఇప్పుడే వస్తారు కూర్చోండి' అన్నాడు అందులో ఒకడు. గత్యంతరంలేక అక్కడే కూర్చున్నాడు. టైము నడిచిపోతోందికాని, ఆమెగారు లోపల్నుంచి రానే రావటంలేదు. తాను సాహసించి లోపలకు వెళ్ళే పరిస్థితి కాదు. ఉక్కిరిబిక్కిరయి పోతున్నాడు. ఆమెగారు ఎప్పుడు వస్తుందా అని కళ్ళు విప్పుకుని చూస్తున్నాడు. గభాలున తలుపు తెరుచుకుని రానేవచ్చింది. చప్పున లేచి నిలబడ్డాడు. ఆమె సంజ్ఞచేసింది. చరుున ప్రక్క గదిలోకి యిద్దరూ వెళ్లారు.

'ముందర ప్రమాణం చెయ్యండి. ఎవరితోనూ చెప్పనని....' డాక్టరు గంభీరంగా మూర్తి మొహంలోకి చూసింది.

ఏమిటని అడిగే ఆలోచనలేకుండా 'అట్లాగే' అన్నాడు.

'మీ జయకు ఏమీ ప్రమాదంలేదు. పైగా బిడ్డకూడా బ్రతికే వుంటుంది....' ఆమె చెప్పటంలో కొంచెం ఆలస్యం చేసింది.

'మరి ఆ పిల్ల చచ్చిపోలేదన్నమాట!....' ఆదుర్దాగా అడిగాడు.

'ఆ పిల్ల పుట్టంగానే చచ్చిపోయింది....కాని....నీకొక రహస్యం చెబుతాను. దానికే నిన్ను ప్రమాణం చెయ్యమన్నది. పట్నంనుంచి ఒక అమ్మాయి మా ఆసుపత్రిలో చేరింది. పెళ్ళి కాలేదు. అయితే పిల్లను కన్నది. ఇది ఒక రహస్యం.

గొప్పింటివాళ్ళమ్మాయి, కాలు జారింది. తన వూళ్ళో తెలిసి పోతుందని అక్కడా యిక్కడా కాలక్షేపం చేస్తోంది. పెద్ద చదువుకని బొంబాయి వెళ్ళిందని చెప్పించారుట. ఇక్కడేమో నా దగ్గర వాగ్దానం తీసుకుని ఆసుపత్రిలో చేరింది. నేను ఒప్పుకున్నాను. పుట్టినపిల్ల విషయమై నేను చూసుకుంటానని. ఆమె ఆడపిల్లనే కన్నది. రాత్రి నుంచి నా ఆలోచనలకు అంతులేకుండా వున్నది. మా యిద్దరికీ తప్ప యీ రహస్యము యింకోళ్ళకు తెలీదు....ఇంకా నేను విపులంగా చెప్ప క్కర్లేదనుకుంటా....' ఆమెగారు తీవ్రంగా మూర్తి మొహంలోకి చూసింది.

మూర్తికి గుక్క తిప్పుకునేటట్లు లేదు. ఆ క్షణాన ఏమాలో చించాలో తోచటంలేదు. చప్పున తల వూపాడు. చేతుల్లో పాపాయిని పెట్టుకుని, డాక్టరు జయ మంచం దగ్గరకు వస్తుంటే, నర్సు ఆశ్చర్య పోయింది, డాక్టరు కనుసంజ్ఞ చేసింది నర్సును చూసి. మూర్తి లోపలికి వచ్చేటప్పటికి, నర్సు తలెత్తి చూడలేకపోయింది. అతను గ్రహించాడు. జయకు స్పృహవచ్చే సమయం కూడా అవుతోంది. మెల్లిగా ప్రక్కలో కదిలింది. మూర్తి సంతోషానికి అంతులేదు; కళ్ల బల వంతాన తెరుచుకుంది. జయకు తెలివి వచ్చింది. ఎదురుగా భర్త కనిపించాడు. సిగ్గుతో కళ్ళు మూసుకుంది. అటూ యిటూ చూసు కుంటూ వత్తిగిలింది. పక్కలో పాప చేతులు కాళ్ల కదులుతున్నాయి. జయ సంతోషం పట్టలేకపోయింది. పాప కళ్లలోకిచూసి, మురిసి పోయింది. ఆనంద బాష్పాలు వచ్చినాయి. వళ్ళు పులకరించింది. గుండె దడదడ కొట్టుకుంది. ఎంతో బిడియం వేసింది. నలుగురు చూస్తుండగా పాపను దగ్గరకు తీసుకోవటానికి, మూర్తి కొంచెం

దూరంగావుండి చేతులు బారజాచాడు, పాపను యివ్వమంటున్నట్టు. జయ పెద్ద నిట్టూర్పు విడిచింది.

పాపను చూసి, అచ్చగా తల్లి పోలికని కొందరు, ఆ ముక్కు, ఆ కన్నూ అచ్చు తండ్రే, ఆడపిల్లకు తండ్రిపోలికవస్తే మంచిదంటారని కొందరు అనుకుంటున్నారు. అన్నీ విని వూరుకుంటున్నాడు మూర్తి. జయ మెల్లిగా కోలుకుంటోంది. డాక్టరు కూడా వప్పుకున్నది. 'నేమిచ్చే మందులకవ్వతే యింత త్వరగా ఆరోగ్యం చేకూరేది కా'దని 'అవును ఆమెకంత గాఢమైన ప్రేమ సంతానం అంటే అందుకనే భయపడింది.' అన్నాడు మూర్తి.

'అమ్మయ్య గండం గడిచిందనుకున్నారు' డాక్టరూ, మూర్తి. 'ఒక్క వుపాయంతో రెండు సమస్యలు పరిష్కృతమయినా'యని ఇద్దరూ సంతోష పడ్డారు.

'ఇక యింటికి తీసుకెళ్ళచ్చు' అని డాక్టరు చెప్పింది. మూర్తి సన్నాహాలు చేసుకున్నాడు యింటికి తీసుకు పోవటానికి. ఆ సాయం త్రమే ప్రయాణం. మూర్తి ఆసుపత్రికి వచ్చేటప్పటికి బాగా చీకటి పడింది. వచ్చి గుమ్మంముందు నిలబడేటప్పటికి లోపలగా గుసగుసలు వినిపిస్తున్నాయి. చప్పున ఆగాడు. ఏమిటో వినిపిస్తున్నాయన్న మాటే గాని, ఏమీ అర్థంకావటంలేదు. అయితే డాక్టరు గొంతుక మాత్రం గుర్తుపట్ట కలిగాడు. చప్పున తలుపు తెరుచుకొని డాక్టరు బైటకు వచ్చింది. అటూ యిటూ పరీక్షగా చూసింది. మూర్తి తలుపు చాటున వదిగాడు. ఇక్కడ యెవ్వరూలేరని గట్టిగా నమ్మకం ఏర్పడింది. డాక్టరు సంజ్ఞ చేసింది. గదిలోంచి ఇరవై యేళ్ళలోపు నడి యౌవనవతి, కంపిస్తూ అతిభయంగా తొందర తొందరగా వచ్చేస్తోంది. ఎలెక్ట్రిక్

లైటుముందర సరోజిని మొహం స్పష్టంగా కనిపించింది మూర్తికి. వెన్నుమీద కొట్టినట్లయింది. ఉలికిపడ్డాడు. శరీరం అంతా వేడెక్కిపోయింది. కళ్ళు మూసుకుపోయినాయి. రెండు క్షణాల్లో తెప్పరిల్లాడు. అప్పటికి డాక్టరు వాకిట్లోంచి తన గదిలోకి వస్తోంది. మూర్తిని చూసి, ఆమె ఒక్కడుగు వెనక్కు వేసింది. చప్పున తమాయించుకుని ఎప్పుడు వచ్చారు అన్నది. మూర్తి యేమీ మాట్లాడలేదు. ఏమిటి అట్లా చూస్తున్నారు అన్నది ఆవేశంగా. అప్పటికీ అతను సమాధానం చెప్పలేదు. రెండు క్షణాలు అట్లాగే నిలబడి 'ఆ అమ్మాయి ఎవ్వరూ' అన్నాడు మూర్తి.

'నేను మీకు చెప్పిన అమ్మాయే! ఇవ్వాళే వాళ్ళవూరు వెళ్ళిపోతోంది. మిమ్మల్ని చూపిస్తానన్నా కూడా "నేను యెవ్వరిని చూడను. నేను యిక్కడ వున్నట్లు యెవ్వరికీ తెలియకూడదు. వారికి కృతజ్ఞతలు చెప్పండి. నేను చేసిన తప్పుకు పసిపిల్ల ఏ విధమైనబాధ అనుభవించకూడదు. వాళ్లు తీసుకొన్న తర్వాత, వాళ్ళ పిల్లమాదిరిగానే పెంచుతారని అనుకుని వెళ్ళిపోతున్నాను. అంతకంటె నేను చెప్పేదిలేదు.... నేనేమి చెప్పలేను" అంటూ వెళ్ళిపోయింది సరోజిని....మీ పిల్ల చచ్చిపోయినా....కళ్ళు తుడుచుకుంటూ, గద్గద స్వరంతో డాక్టరు ఏదో అనబోయింది.

అమాంతంగా మూర్తి, రెండు చేతులు మోహాన కప్పుకొని, 'నా పిల్ల చచ్చిపోలేదు....నా కూతురు బ్రతికేవుంది....నా కూతురు బ్రతికే వుంది.' గొణుక్కుంటూ చకచక గదిలోకి నడిచాడు.

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 29–1–1958)